3/6/90

# సమర్పయామి!

ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అమ్మనీ అర్చననీ వెదుకుతూ పెరట్లోకి వెళ్ళేసరికి ఆయాసపడుతూ నీళ్ళుతోడుతున్న అమ్మ కనిపించింది. ఆమె చేతిలో బక్కెట్టు తీసుకుంటూ—

"ఈ పనులన్నీ నీ కెందుకమ్మా! అసలే నీ ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంటోంది' అన్నాను నొచ్చుకుంటూ.

"ఏముంది బాబు. నువ్వు ముందు బట్టలు మార్చుకో. అసలే అలిసి వచ్చి వుంటావు. కాఫీ ఇస్తాను" అంది చీరకొంగుతో నుదుట నిలిచిన స్వేదబిందువులను తుడుచుకుంటూ.

"అర్చన ఏదమ్మా" అన్నాను.

"ఎవరో అమ్మగారు దూరదేశం నుంచి వచ్చారట. ఆమె భగవంతునిగూర్చి అద్భుతంగా ఉపన్యాసాలు ఇస్తారట. ఆ లెక్చర్స్ వినటానికి భక్తులందరూ గుడికి వస్తున్నారట. అర్చనకూడా గుడికెళ్ళింది" అంది లోపలికి నడుస్తూ.

"మరి... నువ్వు వెళ్ళలేదేమిటి?" అని అడుగుతూ మధ్యలోనే ఆపేసాను.

"అర్చన రమ్మందిరా, కానీ నేనే తలనొప్పిగా ఉందని వెళ్ళలేదు" అంది మెల్లగా.

కాని అది నిజంకాదని నాకు తెలుసు. తను కూడా వెళితే ఆఫీసునుంచి వొచ్చి ఇబ్బంది పడతానని ఆమె వెళ్ళలేదు. కట్టుకున్న భార్య మాత్రం ఆ ఆలోచనే లేకుండా వెళ్ళింది. పెద్ద వయస్సులో భగవంతుడి ధ్యానంలోనూ భక్తిబోధనలతోను కాలం గడపాలని అభిలషించే అమ్మ నాకోసం ఆగిపోయింది. ఆమెపట్ల మనసంతా ఆర్ద్రతతో నిండిపోయింది.

కాఫీ తాగి అమ్మకి వంటలో సాయంచేస్తూ కబుర్లు చెప్తున్నానన్న మాటేగాని ఆలోచనలన్నీ అర్చన చుట్టూ తిరుగుతున్నాయి. పెళ్ళయి ఆర్నెల్లయినా తన తత్వమేమిటో అర్థంకాదు. ఎప్పుడూ ఆ పూజలు, ఈ పూజలంటూ ఉంటుంది. అలాని అమ్మతో నాతో ప్రేమగా ఉండదాంటే ఉంటుంది. కానీ మూఢభక్తితోను, పూజలతోను, భక్తురాలిగా బ్రతకగలుగుతోంది. కాని గృహిణిగా తన బాధ్యతలు మాత్రం నిర్వర్తించలేకపోతోంది. అర్ధాంగిగా కోడలిగా బాధ్యతగా ఉండటం కన్నా పూజలు, భక్తితో ఎక్కువ ఆనందపడుతోంది.

అర్చనకి ఇంత పర్వర్షన్ ఎందుకొచ్చిందని— తను మామగారిని అడిగినప్పుడు ఆయన చెప్పిన సమాధానం గుర్తొచ్చింది.

"అర్చన చిన్నప్పుడు అదెంతగానో అభిమానించే చెల్లెలికి చాలా పెద్ద జబ్బుచేసింది. చచ్చిపోతుందనే అనుకున్నాం. ఆ స్థితిలో అర్చనతల్లీ, అర్చనా విపరీతంగా పూజలు చేసి మొక్కులు మొక్కారు. చివరి కెల్లాగైతేనేమి రాక్యులస్‌గా ఆ పిల్ల బ్రతికింది. బంధువులంతా వీళ్ళపూజలే ఆ పిల్లని బ్రతికించాయన్నారు. అలా వాళ్ళ అవసరంతో దానిలో భక్తికి అంకురార్పణ జరిగింది. దాని తర్వాత ఏ అవసరమొచ్చినా భగవంతుని ఆశ్రయించటం వయస్సుతో పాటు పెరుగుతూ వచ్చింది. దానికితోడు అర్చన మీద ఆమె తల్లి ప్రభావం చాలా ఉంది." అని చెప్పారు.

గేటుతీసిన శబ్దానికి ఆలోచనలనుంచి ఈ లోకంలోకి వచ్చాను. నాలుగైదు కుంకుమ బొట్లతో, విభూతితో, విభూతి బొట్లతో, తలమీద అక్షింతలతో, జడలో రకరకాల పువ్వులతో కనిపించిన అర్చన రూపాన్ని చూడగానే అప్రయత్నంగా నా పెదవులపై చిరునవ్వు కదలాడింది.

'ఏమిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు' అంది అర్చన లోపలికి వస్తూ.

"ఏమీలేదు. మీ అమ్మాజీ లెక్చర్స్ ఎలా ఉన్నాయి" అనడిగాను.

"చాలా గొప్పగా ఉన్నాయండి" అంటూ ఓ పదినిమిషాలపాటు ఆమెని ప్రశంసిస్తూ చెప్పింది.

ఆ రాత్రి పడుకోబోయేముందు దేవుడి పటానికి నమస్కారం చేస్తున్న అర్చనని చూసి—

"రోజూ భగవంతుని ఏమి కోరుకుంటావు?" అని అడిగాను.

"మనమందరమూ సుఖంగా ఉండాలని" అంది చెంపలు వాయించుకుంటూ.

"దేవుడ్ని ప్రార్థిస్తే సరిపోతుందా? మనవంతు



కర్తవ్యాన్ని మనంకూడా నిర్వర్తించాలి" అన్నాను కన్నుగీటుతూ చిలిపిగా.

"రామ... రామ..." అంది.

"ఈ సమయంలో తలుచుకోవాల్సింది రాముడ్ని కాదు— కృష్ణుడ్ని" అన్నాను నవ్వుతూ.

"ఓ వారం మీరూ నేనూ అటువంటి ఆలోచనలు చెయ్యకూడదండి" అంది పమిట సరిచేసుకుంటూ.

"ఎందుకని" అన్నాను విసుగ్గా.

"నేను చేస్తున్న సత్య వెంకట నరసింహస్వామి వారి పూజ చాలా నిష్ఠతో కూడుకున్నది. అందుకని..." అంటూ ఆపేసింది.

ఆమెకెలా బోధపరచాలో అర్థంకాక నిట్టూర్చాను. పెళ్ళయిన ఆర్నెలల్లో ఇలాంటి సందర్భాలే ఎక్కువ.

::: ::: :::

మరో రెండ్నెల్లు అర్చనలో ఎటువంటి మార్పు లేకుండానే గడిచిపోయాయి. అలసటతో ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి తను ఇంట్లో వుండే సందర్భాలు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అర్చన పూజలని హర్షించలేకపోతున్నాను. అలాని నేను, నేను నాస్తికుడ్నేమీ కాదు. కానీ మన నమ్మకాలు... మూఢనమ్మకాలు కాకూడదని— భక్తి... మూఢభక్తి కాకూడదని... వాటితో ఇతరులని ఇబ్బంది పెట్టకూడదనేది నా తత్వం. విపరీతమైన పూజలతో గృహిణి బాధ్యతలు మర్చిపోకూడదని నా అభిప్రాయం. వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకోవాల్సిన అమ్మ అర్చన వలన ఇంటి బాధ్యత తీసుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతానికి అమ్మా నేనూ సర్దుకు పోతున్నాం. కానీ ఎన్నిరోజులిలా? రేపు పుట్టబోయే పిల్లల్ని కూడా ఈ భక్తి.. పూజలలో పడి పట్టించుకోకపోతే ఎలా...? ఈ మూఢభక్తిలో పడి జీవితంలో మిగతా మాధుర్యాలకి తను దూరమవుతూ... నన్నూ దూరం చేస్తోంది. తనకి వివరంగా చెప్పినా వాస్తవాన్ని గ్రహించటంలేదు. అర్చన ఎలా రియలైజ్ అవుతుంది. నిరంతరం ఇవే నా ఆలోచనలు.

నా కిష్టంలేకపోయినా తనని నొప్పించటం ఇష్టంలేక నాకాసక్తి లేకపోయినా అమ్మాజీ అని అర్చన నిత్యం స్మరించే ఆమె బోధనలు వినటానికి రెండుసార్లు వెళ్ళాను. అమ్మాజీ బోధనలు విన్నాక ఆమెపట్ల నాకు గౌరవం ఏర్పడింది. ఆమె భగవత్ బోధనలను జీవితానికి అన్వయించి ఆసక్తిదాయకంగా చెప్తున్నారు. అమ్మాజీని తన ఐడియల్ షీ గా అభిమానిస్తోంది. ఆమె బోధనలు భక్తిగా అయితే వింటోందిగాని తన జీవితానికి మాత్రం అన్వయించుకోవటంలేదనిపించింది.

::: ::: :::

ఆ రోజు స్నేహితుడింట్లో పార్టీ ఉంటే అర్చనని తీసుకెళ్ళాను. పార్టీ పూర్తయినాక ఇంటికి వెడదామని స్కూటర్ తీస్తున్న నాతో "ఏమండి ఒక్క నిముషం ఆగండి" అంది ప్రక్కింటివైపు చూస్తూ". ఎందుకంటూ తలతిప్పి తను చూస్తున్న వైపు చూశాను.

"రెండు రోజుల్నించి అమ్మాజీ గుడికి రావడంలేదు. విషయం ఏమిటో తెలుసుకుందాం రండి" అంది అభ్యర్థనగా సరేనన్నట్టు తనతో ఆ ఇంటివైపు నడిచాను.

చుట్టూ మొక్కల మధ్యలో రెల్లుగడ్డితో నిర్మించిన చిన్న ఇల్లు. చాలా అందంగా ఉంది.

అర్చన "అమ్మాజీ" అని పిలిచింది తలుపు దగ్గరనుంచి.

ఎవరమ్మా! అంటూ బయటకొచ్చారామె.

అర్చనను చూసి "నువ్వామ్మా" అంటూ లోపలికి ఆహ్వానించింది.

"వీరు మా వారు" అంటూ పరిచయం చేసింది.

ఆప్యాయంగా పలకరిస్తూ లోపలికి తీసుకెళ్ళింది. గదిలో మంచం మీద పడుకున్న వృద్ధుడు అలికిడి విని—

"ఎవరూ?" అన్నారు నీరసంగా.

"గుడిలో రోజూ వీరు నా బోధనలు వినటానికి వస్తారు. రండి" అంటూ పరిచయం చేశారు.

"అలాగా" అంటూ ఆయన తడుముకుంటూ లేచారు. మా మొహాల్లో ద్యోతకమవుతున్న ప్రశ్నని గమనించి—

"ఆయన గ్రుడ్డివారు బాబు. మీరు మాట్లాడుతూ ఉండండి" అంటూ అదే గదిలో ఓ ప్రక్క పొయ్యిమీద ఉన్న అన్నాన్ని దించేసి ఆయనకి మందు తెచ్చింది.

"మీరు రెండు రోజుల్నించి గుడికి రావటం లేదెందుకని అమ్మాజీ?" అడిగింది అర్చన.

"మా వారికి రెండు రోజుల్నించి జ్వరమమ్మా. అందుకని రాలేకపోయాను" అంది ఆమె ఆయనకు మందు త్రాగిస్తూ.

అప్రయత్నంగా ఇద్దరం ఒకేసారి ఒకరినొకరం చూసుకున్నాం. పదిరోజుల క్రితం నాకు జ్వరం వస్తే... అమ్మాజీ బోధనలున్నాయని వెళ్ళిన విషయం తనకు కూడా జ్ఞాపకం వచ్చివుంటుంది. ఇంతలో ఓ పాపా— బాబూ పుస్తకాలు పట్టుకుని బయటనుంచి వచ్చి కొత్తవాళ్ళని చూసి సందేహంగా ఆగిపోయారు. "రండర్రా" అంటూ వాళ్ళని దగ్గరకు తీసుకున్నారు అమ్మాజీ.

"నాకు ఆకలేస్తోంది అమ్మాజీ" అంది ఆ పాప.

"ఒక్కనిమిషం" అని మాతో చెప్పి— వాళ్ళని తీసుకెళ్ళి అన్నంపెట్టి మాకు మజ్జిగ తీసుకుని వచ్చి ఇచ్చారు.

"ఈ పిల్లలు..." అంటూ సందేహంగా అడిగిన అర్చనతో—

"వీళ్ళకు ఎవరూ లేరమ్మా. మేము పెంచుకుంటున్నాం" అన్నారామె. మాతో మాట్లాడుతూనే పనులు చేసుకుంటున్న అమ్మాజీని చూసి.

"మీరు ఒక్కరే ఇంటిపనులూ... పిల్లల పనులు... చూసుకుంటారా?" అంది అర్చన.

"అవునమ్మా" అన్నారామె.

## చిగురుపాటి స్ఫూర్తి

"మరి భగవంతుడి సన్నిధిలో గడపడానికి మీకు సమయం ఎలా కుదురుతుంది" అంది సందిగ్ధంగా.

"నా పనుల తరువాతే భగవంతుడు"

"భగవంతుడు బాధ్యతతో చేసే ప్రతిపనిలోనూ ఉన్నాడు. వర్క్ ఈజ్ గాడ్. దాన్ని విస్మరించి అదే లోకంలో ఉన్నా భగవంతుడు క్షమించడు. ఆమె చెప్పేవదానికి అప్పటిదాకా నిశ్శబ్దంగా ఉన్న నేను "వర్క్ ఈజ్ గాడ్" అని చెప్తున్న మీరు ప్రతిరోజూ అన్ని గంటల కాలం భగవంతుని ఉపన్యాసాలతోను, బోధనలతోను ఎలా వెచ్చించగలుగుతున్నారు" అన్నాను.

"నిత్య జీవన స్రవంతిలో ఎదురయ్యే సమస్యలని ఎదుర్కోవటానికి కావాల్సిన మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, శాంతి నాకు ఆ బోధనలవలన భగవంతుని ప్రార్థనవలన లభిస్తుంది కాబట్టి— ఆ సమయానికి గృహిణిగా నా బాధ్యతలు పూర్తిచేసుకుని గుడికి వస్తాను" అన్నారామె చిరునవ్వుతూ.

ఆమెమాటలతో అర్చన మనోదృక్పథంలో కొత్త లోకం సాక్షాత్కరించింది. కళ్ళముందు తన బాధ్యతలు కదలాడాయి. తననింతకాలం సహనంతో భరించిన భర్తలోను, అత్తగారిలోను భగవంతుడు కనిపించాడు.

మా సంభాషణ వింటున్న అమ్మాజీ భర్త—

"కాత్యాయనీ ఒకవేళ భగవంతుడే వచ్చి ఇంత పెద్దవయస్సులో సర్వమూ త్యజించి నాధ్యానంలో వుండక అనాథ పిల్లల పెంపకం— గుడ్డి భర్తకి సేవలంటూ సంసార జంజాటంలో పడ్డావా అంటే ఏం చెప్తావు" అని నవ్వుతూ అడిగారు.

ఆయన ప్రశ్నకి ఆ వృద్ధురాలు చిరునవ్వుతో జవాబు చెప్పింది.

"యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం
శంభో తవారాధనం"

(భగవంతుడా! నేను ఏ పనైతే చేస్తానో అదంతా నీ ఆరాధనే!)

94